

మెరుగైన ఫలితాలే లక్ష్యం

విద్యార్థులకు మరింత నాణ్యమైన చదువు అందించేలా ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తోంది. 8లో



'పారా'హుషార్ 8లో

ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్-40 షాట్ ఫుట్ విభాగంలో దివ్యాంగ క్రీడాకారుడు రొంగలి రవి రజత పతకం సాధించాడు.



పలు రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్ పరిధిలో ఆధునికీకరణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. 8లో

న్యూస్‌రీల్

28న శ్రీవారి దర్శన వేళల్లో మార్పు



కొమ్మాది: చంద్ర గ్రహణం కారణంగా రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి దర్శన వేళల్లో మార్పు ఉంటుందని దేవస్థానం ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. 28న సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీవారి ఆలయం మూసివేస్తామన్నారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి సుప్రభాతసేవ, ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తామన్నారు. 7 గంటల నుంచి యథావిధిగా స్వామి దర్శనాలు కల్పిస్తామని, భక్తులు ఈ మార్పును గమనించాలని కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో..

డాబాగార్డెన్స్: చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు కనకమహాలక్ష్మి ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఈవో కె.శిరీష తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ చేసి 7 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామని వెల్లడించారు.

జెడ్పీ సీఈవోగా పోలినాయుడు బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా ఎం.పోలినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఈవోగా పనిచేస్తున్న పి.శ్రీరామ్మూర్తిని సహకార శాఖకు బదిలీ చేశారు. ప్రస్తుతం డి.పోలినాయుడు డివిజినల్ లెవెల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) హోదాలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. ఆయన్ను జెడ్పీ సీఈవోగా నియమిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వి.మాడుగుల ఎంపీడీవోగా పోలినాయుడు పనిచేశారు. ఈ సందర్భంగా పోలినాయుడుకు పలువురు అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

భీమిలిలో సబ్ జైళ్ల శాఖ అధికారి కార్యాలయం



భీమునిపట్నం: భీమిలిలో గతంలో ఉన్న సబ్ జైలు ప్రాంగణంలోనే జిల్లా సబ్ జైళ్ల శాఖ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని జిల్లా సబ్ జైళ్ల శాఖ అధికారి బి.కృష్ణారావు, జైలర్ డి.రాజు గురువారం పరిశీలించారు. గతంలో ఇక్కడ సబ్ జైలు ఉండగా 2005లో మూసేసి అడవివరం సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఇది అలాగే ఉండిపోయింది. కాగా ప్రస్తుతం జిల్లా సబ్ జైళ్ల శాఖ కార్యాలయం సెంట్రల్ జైలులో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని విధాలుగా ఇక్కడి పాత సబ్ జైలు ప్రాంతం అనువుగా ఉంటుందని ఎంపిక చేసి భావించి మరమ్మతులు చేసి బోర్డులు ఏర్పాటు చేశారు. ఇద్దరు అధికారులు రోజూ ఇక్కడకు వచ్చి పనులు చూసుకుని వెళ్తున్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో కార్యాలయం ఇక్కడ ఏర్పాటు చేసి విధులు నిర్వహిస్తారు. దీని పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, చింతపల్లి సబ్ జైళ్లు ఉంటాయి.

రేపు రోజ్‌గార్ మేళా

తాటిచెట్లపాలెం: దేశవ్యాప్తంగా 10వ రోజ్‌గార్ మేళాను 47 ప్రాంతాల్లో ఈనెల 28న నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఈ రోజ్‌గార్ మేళా నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో కైలాసపురంలో గల సాగరమాల కన్వెన్షన్స్‌లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

23 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం 23 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. అర్బన్ పరిధిలో 22 ప్రాంతాల్లో 8,925 మందికి, రూరల్‌లో ఒక ప్రాంతంలో 509 మందికి వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అర్బన్ పరిధిలో 24 ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

ఏఎంసీకి వందనం



విద్యుత్ దీపాల అలంకరణలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రధాన ద్వారం

- శతాబ్ది వేడుకలకు ఆంధ్రా మెడికల్ కళాశాల సిద్ధం
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు
- రేపు హాజరు కానున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్



ఏఎంసీలో విద్యుత్ అలంకరణాలు

మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల కాకలు తీరిన వైద్యులను అందించింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఏర్పాటైన ఈ వైద్య కళాశాల దేశంలోనే పురాతనమైంది. వందేళ్ల వేడుకకు సిద్ధమైన కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే శతాబ్ది ఉత్సవాలకు ప్రముఖులు హాజరవుతున్నారు. శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.ఎల్.మాండవీయ వర్చువల్‌గా హాజరవుతారు. శనివారం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఉన్నతాధికారులు, పూర్వ విద్యార్థులు భాగస్వాములవుతారు. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏఎంసీ భవనాలను సుందరంగా అలంకరించింది. విద్యుత్ దీపాలతో కేజీహెచ్, ఏఎంసీ ధగధగలాడుతోంది.

వైజాగపటం నుంచి ఏఎంసీగా..

తెలుగు వారి కోసం ప్రత్యేకంగా ఓ వైద్య కళాశాల ఉండాలంటూ అప్పటి మద్రాస్ ప్రభుత్వానికి తెలుగు ప్రజలు చేసిన విన్నపాలతో 1923 జూలై 19న మెడికల్ కళాశాల ప్రారంభమైంది. మద్రాసు యూనివర్సిటీకి అనుబంధంగా పనిచేసిన ఈ వైద్య కళాశాలకు ముందుగా వైజాగపటం వైద్య కళాశాల అని పేరు పెట్టారు. 1926లో ఆంధ్రా యూనివర్సిటీ ప్రారంభమైన తర్వాత వైజాగపటం వైద్య కళాశాల ఏయూకి అనుబంధ కళాశాలగా మారింది. ఆ సమయంలో ఏయూ ఉపకులపతి సీఆర్ రెడ్డి దీని పేరును ఆంధ్రా మెడికల్ కాలేజ్‌గా మార్చాలని మద్రాస్ ప్రభుత్వాన్ని కోరగా 1940లో గెజిట్ విడుదలైంది. ఆ తర్వాత నుంచి ఈ కళాశాల ఆంధ్రా మెడికల్ కాలేజ్‌గా ప్రసిద్ధి చెందింది. అనాటమీ, ఫిజియాలజీ, బయోలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాలతో ప్రారంభమైన ఈ కళాశాలలో తొలి సంవత్సరం 50 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తే.. 32 మందే ప్రవేశాలు పొందారు. ప్రవేశాలు పొందిన వారిలో తొలి ఏడాది 59 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు రికార్డులు చెబుతున్నాయి. రెండో ఏడాది ఓ మహిళ దరఖాస్తు చేసుకున్నారు. కానీ మహిళల కోసం ప్రత్యేక గదులు, బాత్రూం వంటి సదుపాయాలు లేకపోవడంతో ఆమె దరఖాస్తును తిరస్కరించినట్లు వైద్యులు చెబుతారు. 1942లో మహిళల కోసం హాస్టల్ నిర్మించారు.



ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ దీపాలు

ఎందరో మహానుభావులు..

ఏఎంసీలో చదివిన ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. డాక్టర్ రామన్ విశ్వనాథన్, డాక్టర్ పెరుగు శివారెడ్డి, డాక్టర్ శ్రీపాద పినాకపాణి, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ ఉలిమిరి రామలింగేశ్వరరావు, డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు, డాక్టర్ రాజారామ్మోహనరెడ్డి, డాక్టర్ రామలింగస్వామి, డాక్టర్ హిలిడా లాజరస్, డాక్టర్ ఎస్.ఎస్.శ్రీరామాచారి, డాక్టర్ కాకర్ల సుబ్బారావు, డాక్టర్ హబీబుల్లా, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ తదితరులు అంతర్జాతీయంగా ఎంతో ప్రసిద్ధి చెందారు. డాక్టర్ పి.బ్రహ్మయ్యశాస్త్రి దేశంలో ప్రముఖ వైద్య శాస్త్రవేత్తగా పేరు పొందారు. దేశం గర్వించదగ్గ వైద్యులు చదువుకున్న చోటే మేం చదువుకోవడం, ఇక్కడే ఉద్యోగాలు పొందడం, ఇప్పుడు వందేళ్ల సంబరాల్లో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందని కేజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు వైద్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కళాశాలలో చదువుకోవడం తమ కల అని విద్యార్థులు చెబుతున్నారు.

పూర్వ విద్యార్థుల 'వందేళ్ల'కానుక



పూర్వ విద్యార్థులు వందేళ్ల కానుకగా సెంటినరీ బ్లాక్ నిర్మిస్తున్నారు. మొత్తం రూ.50 కోట్లతో బ్లాక్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 1.2 ఎకరాల్లో స్టూడెంట్ సెంటర్, లెక్చర్ హాల్, లైబ్రరీ, రీడింగ్ రూమ్, రీక్రియేషన్ రూమ్, ఇండోర్ గేమ్స్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ బ్లాక్‌ను భారత ఉపరాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాటు చేశారు.

నేటి కార్యక్రమాలివీ..

శతాబ్ది వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశ, విదేశాల నుంచి మూడు వేల మంది పూర్వ విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు భావిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏఎంసీ సెంటినరీ కాలేజీ దినోత్సవం నిర్వహిస్తారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ఎం.ఎల్. మాండవీయ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ముందుగా ఆయన క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

ఉప రాష్ట్రపతి పర్యటన విజయవంతం చేయండి

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మల్లికార్జున సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్

మహారాణిపేట: ఈ నెల 28న జరిగే ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నారని వెల్లడించారు. ఈ పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో పోలీసు, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఎంసీ శత వసంతాల వేడుకకు ఉపరాష్ట్రపతి హాజరవుతున్న నేపథ్యంలో.. ఆయన విశాఖ చేరుకున్నప్పటి నుంచి కార్యక్రమం ముగిసి తిరుగు పయనమయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమాలు జరిగే ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నేవీ అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో ఎక్కడైనా సుందరీకరణ చేపట్టాల్సిన పనులు ఉంటే త్వరితగతిన చేయాలని, పోర్టు రోడ్డులో దుమ్ము, ధూళి లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గార్డు ఆఫ్ ఆనర్ ఇతర సంప్రదాయక కార్యక్రమాల నిర్వహణలో నేవీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయం వహించాలని చెప్పారు. సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇండియన్ నేవీ,ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సైన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ రవిశంకర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం పలు ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తు, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐఎన్ఎస్ డేగ, ఆంధ్రా మెడికల్ కాలేజీ, ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఈస్టర్న్ నావెల్ కమాండ్‌తోపాటు ఉప రాష్ట్రపతి పర్యటించనున్న ఇతర ప్రాంతాలలో భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

అంతర్జాతీయ సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

- నవంబర్ 2న సీఎం జగన్ చేతుల మీదుగా సదస్సు ప్రారంభం
- కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సాక్షి, విశాఖపట్నం : వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కార మార్గాలు, సాగునీటి కొరత లేని విధానాల రూపకల్పన, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జల వనరుల నిర్వహణ తదితర అంశాలపై నగరంలో అంతర్జాతీయ సదస్సు జరగనుందని కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆయా విభాగాధికారులను ఆదేశించారు. 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సదస్సు నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సదస్సు ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమానికి 74 దేశాల నుంచి అంబాసిడర్లు, మంత్రులు, ముఖ్య అతిథులు, ఉన్నతాధికారులు, సభ్యులు హాజరుకానున్నారని వివరించారు. భద్రతాపరమైన, నిర్వహణ పరమైన ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. చివరి రోజున అతిథులు స్థానిక పర్యాటక ప్రాంతాలను, అరకు, తాటిపూడి రిజర్వాయర్లను సందర్శిస్తారని ఇరిగేషన్ ఈఈ ఉమేష్ కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చే వారి వివరాలు, వారి బస వివరాలను పోలీసు శాఖకు ముందుగా తెలియజేయాలని ఆదేశించారు. సమీక్షలో పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డితో పాటు పోలీసు, ఎయిర్ పోర్టు అథారిటీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీ పరిసరాలను శుభ్రపరచండి



సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఏఎంసీ పరిసరాలను శుభ్రపరచాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. కేజీహెచ్ ఆవరణలోని ఏఎంసీని గురువారం పరిశీలించారు. శతాబ్ది ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏఎంసీ పరిసరాల శుభ్రత, వ్యర్థాల తరలింపు, పెయింటింగ్ తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఆంధ్రా వైద్య కళాశాల భవనంలో విద్యుత్ లైటింగ్, పెయింటింగ్, మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను సూచించారు. జోన్-4 కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, డీఈఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధులకు డుమ్మా..!



- జిల్లాలో 174 మంది ఉపాధ్యాయులు గైర్హాజరు
- ఫేషియల్ హాజరు పరిశీలనతో వెలుగులోకి..
- సమగ్ర వివరాలు అందజేయాలని డీఈవో ఆదేశం

విశాఖ విద్య: జిల్లాలో 174 మంది ఉపాధ్యాయులు గురువారం పాఠశాల విధులకు డుమ్మా కొట్టారు. ఎటువంటి ముందస్తు అనుమతుల్లేకుండా విధులకు గైర్హాజరు కావటంపై డీఈవో చంద్రకళ తీవ్రంగా పరిగణించారు. ఫేషియల్ హాజరు పరిశీలనతో గైర్హాజరు అయిన ఉపాధ్యాయుల లెక్క తేలటంతో, వారెందుకలా చేశారో సమగ్ర వివరాలను అందజేయాలని మండల విద్యాశాఖాధికారులు, డిప్యూటీ డీఈవోను ఆదేశించారు. ఇది ఉపాధ్యాయ వర్గాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. దసరా సెలవులు ముగిసిన తరువాత ఉపాధ్యాయులంతా విధులకు హాజరై, విద్యా క్యాలెండర్ మేరకు పాఠ్యాంశాల బోధనపై దృష్టి సారించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దీనిపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఏరోజుకారోజు సమీక్షలు సైతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని డీఈవో కార్యాలయ అధికారులు పరిశీలన చేశారు. ఆనందపురం మండలంలో ఇద్దరు, భీమునిపట్నంలో ఆరుగురు, పద్మనాభం, పెదగంట్యాడలో ఏడుగురు చొప్పున గైర్హాజరయ్యారు. అదే విధంగా చినగదిలి, గోపాలపట్నం, పెందుర్తి మండలాల్లో 13 మంది చొప్పున, మహారాణి పేట, ములగాడలో 16 మంది, సీతంపేట మండలంలో 26 మంది ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేదు. అలాగే డిప్యూటీ డీఈవో పరిధిలో 55 మంది ఉపాధ్యాయులు ఫేషియల్ హాజరు నమోదు చేయలేదు. ఇలా ఎంఈవోలు డీడీవోలుగా వ్యవహరించే జిల్లాలోని పది మండలాల పరిధిలో, అదే విధంగా డిప్యూటీ డీఈవో పరిధిలో కలుపుకొని మొత్తం 174 మంది ఉపాధ్యాయులు వారి విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. వారంతా విధులకు డుమ్మా కొట్టారా..? మరేదైనా సాకేంతిక కారణాలేమైనా ఉన్నాయా..? అనేది పరిశీలన జరిపి తదుపరి చర్యలు నిమిత్తం సమగ్ర వివరాలను అందజేయాలని డీఈవో ఆదేశించారు. దీంతో సదరు అయ్యవార్ల లెక్క తేల్చేందుకు డిప్యూటీ డీఈవో, మండల విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు.

ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకుల మృతి
- మరొకరి పరిస్థితి విషమం

ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఇద్దరు యువకులు తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఫ్లైఓవర్‌పై మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. వేగంగా వస్తూ వాహనాలను అదుపు చేయలేక ప్రమాదానికి గురవుతున్నారు.





సంఘటన స్థలంలో శ్యామ్ మృతదేహం (ఇన్‌సెట్) శ్యామ్ (ఫైల్)



తోట హర్ష (ఫైల్)

అల్లిపురం: నగరంలోని తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండో పట్టణ ఇన్‌చార్జి సీఐ రమణమూర్తి తెలిపిన వివరాలివీ.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కాపరపు శ్యామ్(21), కాపరపు రాజు అలియాస్ బాబీ(20), అనకాపల్లి జిల్లా కొత్తూరుకు చెందిన తోట హర్ష అలియాస్ నాని ఇళ్లకు సున్నాలు వేస్తూ.. తద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గాజువాకలో సున్నాలు వేసేందుకు వచ్చిన వారు బుధవారం రాత్రి 10.45 గంటల ప్రాంతంలో ఒకే బైక్‌పై ఆర్.కె.బీచ్‌కు వెళ్లారు. తిరిగి సుమారు మూడు గంటల ప్రాంతంలో తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా గాజువాక వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పడంతో వంతెన చివర్లో గల మలుపు వద్ద డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో శ్యామ్ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మరణించాడు. హర్ష తలకు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజు కాళ్లు విరిగిపోవడంతో ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలోనే హర్ష ప్రాణాలు కోల్పోయాడు. రాజు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. శ్యామ్, రాజులిద్దరూ అన్నదమ్ముల పిల్లలు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

ఈ విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలను ఆదేశించారు.

నిబంధనలు పాటించాలి

తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై ఎత్తు పల్లంతో కూడిన ప్రమాదకర మలుపు వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. ఫ్లైఓవర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 13 మంది మరణించారని, 15 మందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఇంజినీరింగ్ వైఫల్యమే ఇందుకు కారణమని, ఈ సమస్యపై గత ఫిబ్రవరిలో జీవీఎంసీ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. జీవీఎంసీ అధికారులు సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వాహన చోదకులు కూడా నిబంధనలు పాటించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రమాదకర, శిక్షార్హమైన డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. వాహన చోదకులు నిబంధనలు పాటించకపోవడం వల్ల వారితో పాటు పాదచారులకు భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదాలకు నెలవు ఆ మలుపు



ప్రమాదానికి కారణమైన ఫ్లైఓవర్‌పై మలుపు

2016లో ఫ్లైఓవర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 12 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే వైపు వంతెన చివరన మలుపు ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ఒక్కటి మినహా.. మిగిలిన అన్ని ప్రమాదాల్లో అందరూ చనిపోవడం దురదృష్టకరం. కొన్ని రోజులు ఆ మలుపు ప్రాంతంలో స్టాపర్లు పెట్టి వాహనాల స్పీడును తగ్గించడంతో ప్రమాదాలు తీవ్రత తగ్గింది. ప్రస్తుతం అక్కడ స్టాపర్లు తొలగించడంతో మళ్లీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఓర్వ లేనితనంతోనే ఆరోపణలు

- స్థలం ఆక్రమణ అవాస్తవం
- తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయపోరాటం చేస్తా
- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బర్కత్ అలీ

మద్రిపాలెం : రాష్ట్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిందని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓ పత్రిక తనపై నిరాధార ఆరోపణలతో కథనం ప్రచురించిందన్నారు. దీనిపై సంబంధిత పత్రికతో పాటు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరాపై న్యాయపోరాటం చేస్తానన్నారు. వాస్తవానికి 2008లో మద్రిపాలెం ప్రాంతంలో 1,400 గజాల స్థలాన్ని తనకు డెవలప్‌మెంట్‌కు ఇచ్చారన్నారు. అప్పట్లో కొందరు వ్యక్తులు ఆ స్థలం స్థానిక మసీద్‌కు చెందినదిగా వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో.. ప్రైవేట్ స్థలంగా బోర్డు అధికారులు ధ్రువీకరించారన్నారు. ఆ స్థలాన్ని తనకు డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో 2009లో వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఆ తర్వాత జీవీఎంసీ అనుమతులు పొంది, ఆ స్థలంలో నిర్మాణం చేసి విక్రయించినట్లు వివరించారు. దానికి సంబంధించి తహసీల్దార్, జీవీఎంసీ అధికారులు జారీచేసిన పత్రాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అటువంటి వారిపై న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయిని దుర్మరణం

- దేవరాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం
- శోక సముద్రంలో కుటుంబ సభ్యులు
- తల్లడిల్లిన విద్యార్థులు, సహోధ్యాయులు
- గాయాలతో బయటపడ్డ మరో టీచర్


బొడ్డు శ్రీదేవి (ఫైల్)


ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దేవరాపల్లి: సహచర ఉపాధ్యాయులను పలకరించారు.. విద్యార్థుల వందనాన్ని అందుకొని వారిని ముద్దులాడారు.. పాఠశాల పనిపై ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలిసి కొద్ది సమయం ముందే తమ కళ్ల ముందు కనిపించిన ఉపాధ్యాయిని విగత జీవిగా మారడంతో విద్యార్థులు, సహోద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాదంలో అదే వాహనంపై వెళుతున్న మరో టీచర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దేవరాపల్లిలో గురువారం ఈ ఘోరం జరిగింది. సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన బొడ్డు శ్రీదేవి (37) దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా బాలికా విద్యాలయలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆమె గురువారం ఉదయం యథావిధిగా పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయించడానికి తన సహచర ఉపాధ్యాయిని దేవితో కలిసి ద్విచక్రవాహనంపై బేతపూడి నుంచి దేవరాపల్లి బయలుదేరి వెళ్లారు. ఆటోస్టాండు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టరును తప్పించే క్రమంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డు మీద పడిపోయారు. ట్రాక్టరు వైపు పడిపోయిన శ్రీదేవి ఛాతీ మీద నుంచి ట్రాక్టరు తొట్టె వెనుక చక్రం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతూ షాపుల వైపు పడిపోయిన మరో ఉపాధ్యాయిని దేవి ప్రాణాలతో బయటపడ్డారు. మృతి చెందిన ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవికి భర్త నాగేశ్వరావుతో పాటు పదో తరగతి చదువుతున్న కుమార్తె త్రిషిక, నాలుగో తరగతి చదువుతున్న కుమారుడు కార్తికేయ ఉన్నారు. సబ్బవరం కస్తూర్బా విద్యాలయలో పనిచేస్తూ.. ఇటీవల దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా పాఠశాలకు బదిలీపై వచ్చారు. భర్త నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులు విలపించిన తీరు అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి సీహెచ్‌సీకి తరలించినట్లు స్థానిక పోలీసు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. ట్రాక్టరును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- మున్సిపల్ స్కూళ్ల విలీనానికి కసరత్తు
- కి.మీ దూరంలోని ప్రైమరీ స్కూళ్లలోని 3,4,5 తరగతులు హైస్కూళ్లకు తరలింపు
- నగరంలో 28 పాఠశాలల గుర్తింపు
- సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఏర్పాట్లు
- క్షేత్ర స్థాయిలో పరిశీలనతోనే విలీన ప్రక్రియ


నగరంలోని ఆర్‌బీఎం యూపీ స్కూల్

విశాఖ విద్య: జాతీయ విద్యా విధానం అమలుతో విద్యార్థులకు మరింత నాణ్యమైన చదువు అందించేలా ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తోంది. బడుల బలోపేతమే లక్ష్యంగా జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియతో మెరుగైన ఫలితాలు కనిపిస్తుండడంతో తదుపరి చర్యలకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. మున్సిపల్ స్కూళ్ల విలీనంపై దృష్టి సారించారు. కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో విశాఖ నగరంలో విలీన స్కూళ్ల జాబితా సిద్ధం చేశారు. ప్రాథమిక సమాచారంతో సిద్ధం చేసిన పాఠశాలల జాబితాపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాల మేరకు విలీన ప్రక్రియ చేపట్టేందుకు క్షేత్రస్థాయి పరిశీలనకు కార్యాచరణ సిద్ధం చేశారు.

జిల్లాలో ఇదీ లెక్క

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూళ్లు కలిపి 610 ఉన్నాయి. వీటిలో ఏటా లక్ష మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. మున్సిపల్ స్కూళ్లలో చూసినట్లయితే ప్రాథమిక పాఠశాలలు 95, ప్రాథమికోన్నత – 5, హైస్కూళ్లు 21 ఉన్నాయి. వీటిలో సుమారు 24 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను, అదే విధంగా ప్రాథమికోన్నత స్కూళ్లలోని 6, 7, 8 తరగతులను సమీప హైస్కూళ్లలో విలీనం చేయనున్నారు. దీని తర్వాత 3 కిలోమీటర్లు పరిధిలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇలా విలీనం చేసేందుకు జిల్లాలో 28 స్కూళ్లను గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేలా విద్యాశాఖాధికారులు జాబితా సిద్ధం చేశారు.

ఆమోదయోగ్యంగా విలీనం

నగరంలోని మహారాణిపేటలోని ఆర్‌బీఎం యూపీ ఎస్‌ను విలీన జాబితాలో గుర్తించారు. ఇదే జరిగితే ఇక్కడ ఉన్న 3 నుంచి 8వ తరగతి వరకు గల విద్యార్థులను సమీప ఎంజీఎం హైస్కూల్‌కు తరలించాలి. అయితే, ఎంజీఎం హైస్కూల్‌లో ఇప్పటికే 502 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న భవనాలు తరగతుల నిర్వహణకు సరిపోతున్నాయి. కాగా విలీనం చేసేందుకు ప్రతిపాదించిన ఆర్‌బీఎం అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 556 మంది విద్యార్థులు ఉన్నారు. దీన్ని హైస్కూల్ చేయాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉంది. గత అనుభవాల నేపథ్యంలో ఇలాంటి అంశాలపై విద్యాశాఖాధికారులు తగిన ఆలోచన చేసి ముందుకెళ్లాల్సి ఉంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా మున్సిపల్ స్కూళ్ల విలీనంపై జాబితా సిద్ధం చేశాం. విలీనంతో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. జెడ్పీ మేనేజ్మెంట్ పరిధిలో విలీన ప్రక్రియ చేపట్టిన మాదిరిగానే మున్సిపల్ స్కూళ్ల విలీనం ఉంటుంది. సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉన్నందున విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– గౌరీ శంకర్, డిప్యూటీ డీఈవో, విశాఖపట్నం

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



విలీన ప్రక్రియ మంచి నిర్ణయమే. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలనతో ప్రజామోదం మేరకు నిర్ణయం తీసుకోవాలి. చారిత్రక నేపథ్యం కలిగిన మా స్కూల్‌ను హైస్కూల్ చేయాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల నుంచి డిమాండ్ ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

– హెచ్.ప్రభాకర్‌రావు, హెచ్ఎం, ఆర్‌బీఎం యూపీ స్కూల్

విద్యార్థుల మేలు కోసమే..



విద్యార్థులకు మేలు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అందుకోసమే పాఠశాలల విలీన ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మున్సిపల్ స్కూళ్ల విలీనంతో విద్యార్థులకు నష్టం జరగదు. దీనిపై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి డీఈవోలకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

– యం.జ్యోతికుమారి, ఆర్జేడీ, విశాఖపట్నం

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

➡ ఈ నెల 27 నుంచి 29 వరకు రాజమండ్రి – విశాఖపట్నం – రాజమండ్రి (07466/07467) పాసింజర్ స్పెషల్ రద్దు.

➡ ఈ నెల 27, 28న విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

➡ ఈ నెల 27, 28న విశాఖలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

➡ ఈ నెల 27, 28న హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జగదల్‌పూర్ నుంచి బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి కాకుండా టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

➡ ఈ నెల 27, 28న భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జగదల్‌పూర్ నుంచి బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. ప్రయాణికులు మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారులు సూచించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత


అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్‌లో సుమారు 50 కేజీల గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాల మేరకు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మధుసూదనరావు, సిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన కిరణ్‌కుమార్, దీపక్ తరణి, హిమబిందు పాత్రో లగేజీలను తనిఖీలు చేయగా సుమారు 50 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరు ఒడిశా, బరంపురం నుంచి ముంబైకి అక్రమంగా తరలిస్తున్నట్లు చెప్పారు. వారిని అదుపులోకి తీసుకున్నారు.

అప్పన్న ఆలయంలోకి శునకం ప్రవేశం

- దర్శనాలు నిలిపేసి సంప్రోక్షణ చేసిన అధికారులు
- సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోకి గురువారం శునకం ప్రవేశించడంతో సంప్రోక్షణ చేయాల్సి వచ్చింది. దీంతో గంటపాటు భక్తులకు దర్శనాలు నిలిపేశారు. ఈ పరిణామాలకు సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే... స్వామివారి దర్శనాలు గురువారం ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. సుమారు ఏడు గంటల సమయంలో ఒక శునకం ఆలయ ఉత్తర రాజగోపురం లోనుంచి ప్రవేశించి ఆలయంలోకి వచ్చేసింది. శునకాన్ని చూసిన వైదికులు, సిబ్బంది బెంబేలెత్తారు. వెంటనే అప్రమత్తమై ఆలయం లోనుంచి బయటకు తరిమేశారు. ఆ తర్వాత గంటపాటు భక్తుల దర్శనాలు నిలిపివేసి ఆలయాన్నంతటినీ సంప్రోక్షణ (శుద్ధి) చేశారు. ఆ తర్వాత భక్తులకు దర్శనాలు పునరుద్ధరించారు. అసలు ఆలయంలోకి శునకం ప్రవేశించడానికి కారణం నిర్లక్ష్యమే అని తెలుస్తోంది. ఉత్తర రాజగోపురం లోనుంచి శునకం ఆలయంలోకి వచ్చిందంటే ఆ మార్గంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది ఏం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అంకితభావంతో విధులు నిర్వర్తించాల్సిన వారంతా సమయపాలన పాటించడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

శిక్షణ కేంద్రంలోకి అనధికారికంగా ప్రవేశించడం తగదు

- ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ప్రధాన మంత్రి కౌశల్ యోజన కేంద్రంలో శిక్షణ తరగతులు జరుగుతున్న సమయంలో కొంత మంది గుంపుగా వచ్చి విద్యార్థులు ఇబ్బంది పడేలా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వచ్చిందని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సంబంధిత ప్రాంగణంలోకి బయటి వ్యక్తులకు ప్రవేశం లేదని నిర్దిష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. వాటిని ఉల్లంఘిస్తూ పదుల సంఖ్యలో వ్యక్తులు రావడాన్ని ఆయన తప్పుబట్టారు. వర్సిటీ నుంచి ముందస్తు అను మతి తీసుకోకుండా వీరు రావడం సరికాదన్నారు. ఏయూలో చాలా కాలంగా స్కిల్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని.. ఇది ఒక పెద్ద వ్యవస్థగా ఉందన్నారు. ఇందులో సీమెన్స్ అనేది ఓ విభాగం మాత్రమేనన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభం నుంచి పనిచేయని, పనికిరాని కొన్ని పరికరాలు ఇక్కడ ఉండటం గుర్తించామన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

ఏయూలోని ప్రధానమంత్రి కౌశల్ యోజన కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. ఇక్కడ ఉన్న పరికరాలు, విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఐదుగురు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురితో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. సభ్యులుగా ఉండేందుకు ఆసక్తి ఉన్న వారు తగిన ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ ఒకటో తేదీన మూడు గంటలకు విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. అర్హత ఉన్న వారిని సభ్యులుగా నియమిస్తామని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రోడ్డు ప్రమాదం

- ప్రమాద స్థలిలోనే ఉద్యోగి దుర్మరణం


కరణం కనక అప్పారావు (ఫైల్)

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని స్టీల్‌మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్) విభాగం వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వడ్లపూడి ప్రాంతానికి చెందిన కరణం కనక అప్పారావు (51) ఎస్ఎంఎస్‌లో జనరల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం మధ్యాహ్నం విభాగంలోని పైఅంతస్తు నుంచి కిందకు వచ్చి సామగ్రిని ఒక వాహనంలో ఎక్కించాడు. అనంతరం పని ప్రదేశానికి వెళ్లే క్రమంలో ఒక భారీ ట్రాలర్ డ్రైవర్, మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తూ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో అప్పారావుపైకి దూసుకొచ్చేశాడు. ఈ ప్రమాదంలో అప్పారావు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ఆనందపురం: ఓ మహిళ మరణానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు భీమునిపట్నం 15వ మెట్రోపాలిటన్ అదనపు కోర్టు ఏడాది జైలు, రు.5 వేలు జరిమానా విధించింది. సీఐ రామచంద్రరావు తెలిపిన వివరాలివీ. పెందుర్తి ప్రాంతానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కె.శ్రీనివాసరావు 2019 జనవరిలో సింహాచలం వైపు బస్సు నడుపుతుండగా శిర్లపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో పద్మనాభం మండలం పెంటకు చెందిన ఆర్.పైడమ్మ(60) మృతి చెందింది. కేసు విచారణ అనంతరం ఆమె మృతికి ఆర్టీసీ డ్రైవరే కారణమని కోర్టు నిర్ధారణకు వచ్చింది. దీంతో డ్రైవర్ శ్రీనివాసరావుకు పైవిధంగా కోర్టు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

'పారా'హుషార్

- ఆసియా పారా క్రీడా పోటీల్లో రవి సత్తా
- చిరికివానిపాలెంలో సంబరాలు


షాట్‌పుట్ విసురుతున్న రవి(ఫైల్)

కె.కోటపాడు: చైనాలో జరుగుతున్న ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో దివ్యాంగ క్రీడాకారుడు రొంగలి రవి రజత పతకం సాధించి సర్వత్రా ప్రశంసలందుకుంటున్నాడు. అతడి విజయంతో కె.కోటపాడు మండలంలోని తన స్వగ్రామం చిరికివానిపాలెంలో సంబరాలు మిన్నంటాయి. దేశానికి, పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు గుర్తింపును తీసుకొచ్చాడని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలు : చిన్నప్పటి నుంచి రవి క్రీడలతోపాటు చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు భీమిలి ఏఎంజీ పాఠశాలలో చదివాడు. పదిలో 9.0 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఎస్.కోట(2012–14) లో ఇంటర్ చదివి 933 మార్కులు, డిగ్రీ(2014–17)లో 7.8 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు.

17వ ఏట పారా క్రీడా పోటీలపై ఆసక్తి

ఇంటర్ చదువు పూర్తయిన సమయంలో దివ్యాంగులకు పారా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు రవి తెలుసుకున్నాడు. దీంతో తనకు ఆసక్తి ఉన్న బ్యాడ్మింటన్ పోటీలు 2015లో బెంగళూరులో నిర్వహించగా, అందులో ఉత్సాహంగా పాల్గొన్నాడు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బ్రాంజ్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2016 ఢిల్లీలో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని సింగిల్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ పొందాడు. 2017 హైదరాబాద్‌లో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. కాగా.. రవిది రైతు కుటుంబం కావడంతో ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. తనకు ఇష్టమైన బ్యాడ్మింటన్ పోటీలపై ఆసక్తి తగ్గించుకుని అథ్లెటిక్స్ విభాగంలో షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల వైపు దృష్టి సారించాడు.

రైతు బిడ్డకు ఆర్థిక కష్టాలు : రవి తల్లిదండ్రులు రొంగలి దేముడుబాబు, మంగ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. క్రీడల పట్ల రవి చూపుతున్న ఆసక్తిని కాదన లేక అప్పోసప్పో చేసి ప్రోత్సహిస్తున్నారు. వారి ఆశయాలను ఒమ్ము చేయకుండా రవి పట్టుదలతో అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు. 2021లో బెంగళూరులోని అకాడమీలో చేరి మరిన్ని మెళకువలు నేర్చుకున్నాడు.